సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 14 । జనవరి । 2023



బుడియాల సందడి

డుంబ్రిగుడ మండలం అరకులో శుక్రవారం జరిగిన వారపు సంతలో బుడియాలు సందడి చేశారు.



గిరి రైతులకు గిట్టుబాటు ధర లక్ష్యం

- జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ ||లో



సకాలంలో ఈ-క్రాప్ నమోదు

రబీ ఈ-క్రాప్ నమోదు సకాలంలో పూర్తి చేయాలని ఏడీఏ జాహ్నవి సూచించారు. ||లో

న్యూస్‌రీల్

సంక్రాంతి శుభాకాంక్షలు

సాక్షి, పాడేరు: జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు, ప్రజాప్రతినిధులు, అధికారులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ పండగలను ఘనంగా జరుపుకోవాలని, ఇంటిల్లాపాది సుఖ సంతోషాలతో జీవించాలని వారు ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు ఆర్.గోపాలకృష్ణ, సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్లు అభిషేక్, సుభం బన్సల్,అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఉమ్మడి విశాఖ జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు.అరకులోయ, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులాపల్లి ధనలక్ష్మిలు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

అటవీ సంరక్షణకు విఘాతం కలిగిస్తే చర్యలు

అడ్డతీగల: తూర్పుకనుమల్లో అటవీ సంరక్షణకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అడ్డతీగల అటవీక్షేత్రాధికారి డి.లలిత కుమారి హెచ్చరించారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో పలు అంశాలపై మాట్లాడారు. అక్రమంగా అటవీ ఫలసాయం రవాణా చేసినా, అటవీ భూములు ఆక్రమించినా, రక్షిత అటవీ ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలకు పాల్పడినా ఏపీ ఫారెస్ట్ యాక్ట్ 1967 ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. రంగురాళ్ల తవ్వకాల నిరోధంలో భాగంగా పర్యవేక్షణకు సిబ్బందిని నియమించామని చెప్పారు. అడవుల నరికివేత ఎక్కడా జరగకుండా నిఘా ఉంచామన్నారు. అటవీ సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రకృతి వరప్రసాదమైన అడవులను సంరక్షించుకోవడంలో అందరూ భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని ఆమె కోరారు.

ఫోర్టిఫైడ్ బియ్యంపై అపోహలొద్దు

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శివప్రసాద్



గుడివాడలో బాలింతలతో మాట్లాడుతున్న పౌరసరఫరాలశాఖ అధికారి శివప్రసాద్

పాడేరు రూరల్: ప్రభుత్వం సరఫరా చేసే ఫోర్టిఫైడ్ బియ్యంపై అపోహలు వద్దని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శివప్రసాద్ అన్నారు. మండలంలోని గుడివాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యం, కందిపప్పు, పాలు, గుడ్ల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు,గర్భిణులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికారంపై అవగాహన కల్పించారు. వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు లకే నాని పాత్రుడు, సీడీపీవో తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీలకు తరలిరండి

తాళ్లూరు గ్రామస్తులకు రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సల్ సూచన



గ్రామసభలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శుభం బన్సల్

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామమైన తాళ్లూరులో రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభంబన్సల్ శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఉదయం పోశమ్మగండి నుంచి బోటుపై తాళ్లూరు వెళ్లారు . గ్రామస్తులతో మాట్లాడారు. పెదభీంపల్లి వద్ద నిర్మించిన పునరావాస కాలనీలకు తరలిరావాలని వారిని కోరారు. వారం రోజుల్లో నూతన గృహాలు చూసుకునేందుకు వస్తామని గ్రామస్తులు తెలిపారు. తాళ్లూరు గ్రామంలో 113 కుటుంబాలు ఉండగా గతంలో 23 మంది పునరావాస కాలనీకి తరలివచ్చారు. మిగిలిన కుటుంబాలు పాత గ్రామంలోను ఉండడంతో వీరిని కాలనీలకు తరలిరావాలని సబ్‌కలెక్టర్ కోరారు. తహసీల్దార్ రామకృష్ణ పాల్గొన్నారు.



||లో

నేడు ఉపమాకలో గోదా కల్యాణం

400 కిలోమీటర్లు.. రూ.568 కోట్లు

రాజమహేంద్రవరం– విజయనగరం వరకు మూడు జిల్లాలను కలుపుతూ చేపట్టిన జాతీయ రహదారి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 400 కిలోమీటర్ల పొడవునా చేపట్టే ఈ నిర్మాణానికి రూ.568 కోట్లను కేంద్ర ప్రభుత్వం వెచ్చించింది.

- రాజమహేంద్రవరం టూ విజయనగరం హైవే నిర్మాణం
- మూడు జిల్లాలను కలుపుతూ జాతీయ రహదారి పనులు



రంపచోడవరం మండలం ఐ.పోలవరం వద్ద జాతీయ రహదారి రోడ్డు నిర్మాణ పనులు

రంపచోడవరం: మూడు జిల్లాలను కలుపుతూ చేపట్టిన రాజమహేంద్రవరం - విజయనగరం హైవే రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 400 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.568 కోట్లు వెచ్చించింది. దశల వారీగా నేషనల్ హైవే ఆథారిటీ అధికారులు చేపట్టిన పనులు చివరి దశకు చేరుకుంటున్నాయి. ఇప్పటికే గోకవరం నుంచి ఐ.పోలవరం జంక్షన్ వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం పూర్తయింది.

నాలుగు మండలాల పరిధిలో..

రంపచోడవరం మండలం ఐ.పోలవరం నుంచి కాకరపాడు వరకు జాతీయ రహదారి 516 రోడ్డు పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి నాలుగు మండలాలను కలుపుతూ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. పది కిలోమీటర్లు మేర రోడ్డును విస్తరిస్తున్నాయి. ఈ నాలుగు మండలాల్లో హైవే రోడ్డు నిర్మాణానికి 725 ఎకరాలు అవసరం.

585 ఎకరాలు అప్పగింత

ఇప్పటివరకు 585 ఎకరాల ప్రభుత్వ భూమిని రోడ్డు నిర్మాణ పనులకు ఇంజినీరింగ్ అధికారులకు అప్పగించారు. మరో 140 ఎకరాలు ప్రైవేట్ భూమి ఉంది. ఈ భూమిని అప్పగించేందుకు అవార్డు ఎంక్వైయిరీ ప్రకటించిన తరువాత, భూ యాజమానులకు నష్టపరిహారం చెల్లించి భూమిని అప్పగిస్తారు. అయితే అప్పటి వరకు రోడ్డు నిర్మాణ పనులు చేసుకునేందుకు ఎటువంటి ఇబ్బందులు లేవని అధికారవర్గాలు తెలిపాయి. సుమారు 70 కిలోమీటర్లు మేర నిర్మిస్తున్న రోడ్డు మార్గంలో 120 చోట్ల కల్వర్టులు, వంతెనలు నిర్మాణం చేపడతారు.

రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకు..

హైవే రోడ్డు నిర్మాణం తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం నుంచి గోకవరం, పోక్సుపేట, ఐ. పోలవరం జంక్షన్, గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, కాకరపాడు జంక్షన్, కృష్ణదేవిపేట, చింతపల్లి, లంబసింగి, పాడేరు, అరకు మీదుగా విజయనగరం వరకు రోడ్డు నిర్మాణం జరుగుతుంది. మినిస్ట్రీస్ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు అండ్ నేషనల్ హైవే ఆథారిటీ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

చురుగ్గా పనులు

సుమారు 70 కిలోమీటర్లు మేర రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పాత రోడ్డును వెడల్పు చేసే పనులు పూర్తవుతున్నాయి. ప్రస్తుతం పనులకు ఎటువంటి ఇబ్బంది లేదు. ప్రైవేట్ భూములను అప్పగించే ప్రక్రియ పూర్తయితే రోడ్డు నిర్మాణ పనులకు ఎటువంటి ఇబ్బందులు లేవు.

– చక్రవర్తి, జేఈ, ఆర్అండ్‌బీ, కాకినాడ

భోగి సందడి

- భక్తిశ్రద్ధలతో వేడుకలు
- శంఖుదేవుడికి ప్రత్యేక పూజలు
- అలరించిన తుడుము, థింసా నృత్యాలు



శుక్రవారం రాత్రి పాడేరు రమణానగర్‌లో భోగిమంటను కాగుతున్న స్థానికులు

సాక్షి,పాడేరు: గతానికి వీడ్కోలు పలుకుతూ, రేపటి జీవిత సంక్రాంతికి స్వాగతం పలికే భోగి పండుగ వేడుకలు జిల్లాలో శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా భోగి మంటలతో పండగకు స్వాగతం పలికారు. ముందుగా గ్రామ చావిడిలో కొలువుదీరిన శంఖుదేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భోగి మంటలు ప్రారంభించారు. పాడేరు, హుకుంపేట, జి.మాడుగుడ మండలాల్లోని గ్రామాల్లో భోగిమంటల సందడి నెలకొంది. గిరిజన సంప్రదాయ తుడుము, డప్పు వాయిద్యాలతో థింసా నృత్యాలు చేస్తూ భోగి వేడుకలు ప్రారంభించారు.

గండిపోశమ్మను దర్శించుకున్న ఒడిశా మాజీ డీజీపీ



పాపికొండల విహారయాత్రకు బయలుదేరుతున్న ఒడిశా మాజీ డీజీపీ శుక్లా

దేవీపట్నం: ఒడిశా మాజీ డీజీపీ శుక్లా కుటుంబ సమేతంగా శుక్రవారం పాపికొండల విహారయాత్రకు తరలి వెళ్లారు. ఉదయం రాజమహేంద్రవరం నుంచి పోశమ్మ గండికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో జీవీ లక్ష్మీకుమార్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న ఆలయ స్థితిగతులను ఈవో నుంచి తెలుసుకున్నారు.అనంతరం పాపికొండల విహారయాత్రకు వెళ్లారు.

స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

కలెక్టర్ సుమిత్‌కుమార్



బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశమందిరంలో శుక్రవారం ఏజెన్సీలోని 43 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.2 కోట్ల 30 లక్షల రుణాల చెక్కును పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి డ్వాక్రా సంఘం ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు.అన్ని బ్యాంకులు అందిస్తున్న రుణాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రుణాల సొమ్మును కూడా సకాలంలో బ్యాంకులకు చెల్లించి, బ్యాంకుల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ అభిషేక్, డీఆర్‌డీఏ పీడీ మురళీ, ఎల్‌డీఏ రవితేజ, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో 'కొయ్యూరు' అకాడమి సత్తా



సాధించిన కప్, కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కొయ్యూరు: శాప్ లీగ్ రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో స్థానిక కుస్తీ అకాడమి విద్యార్థులు సత్తా చాటారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుని రెండో స్థానంలో నిలిచారు. అనంతపురం జిల్లా దిమ్మగుడి జిల్లా పరిషత్ పాఠశాలలో రాష్ట్రస్థాయి శాప్ లీగ్ కుస్తీ పోటీలను ఈ నెల 12,13 తేదీల్లో నిర్వహించారు. వీటిలో పాల్గొన్న కొయ్యూరు కుస్తీ అకాడమి విద్యార్థులు సత్తా చాటారు. మొత్తంగా ఎనిమిది బంగారు, నాలుగు వెండి, రెండు బ్రాంజ్ పతకాలను సాధించారు. అండర్ 17 విభాగంలో కె రాణి, కె.కజియా, కె.దేవమ్మ, కె.కమల, ఎం.రమణబాబు, వి.మహేష్, వి.ప్రసాద్, సీహెచ్ మహేష్ బంగారు, కెరుతు, జి.రూప, ఎస్.దేవి, ఎస్.కార్తీక్ వెండి పతకాలను సాధించారు. కె.సుజాత బ్రాంజ్‌ను సొంతం చేసుకున్నారు. కుస్తీ అకాడమి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న పీడీ అంబటి నూకరాజు మాట్లాడుతూ శాప్ రాష్ట్రస్థాయి లీగ్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ రావడం ఆనందంగా ఉందన్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం: ఎటపాక నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీలో ఐదో తరగతి పాస్ అయిన వారు నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు అర్హులని తెలిపారు. ఇందు కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 29న రంపచోడవరం, కూనవరం, ఏటపాక మండల కేంద్రాల్లో అర్హత పరీక్ష ఉంటుందని తెలిపారు.

మూడు, నాలుగు తరగతులు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివిన అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. వివరాలకు 7668654709, 9705852243 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

చలి గుప్పిట్లో మన్యం



పాడేరు సమీపంలోని చింతలవీధి రోడ్డులో దట్టంగా కురుస్తున్న పొగమంచు



మంచులో పాడేరు సంతకు వెదురు బుట్టలను తీసుకువెళ్తున్న మహిళలు

- ఉదయం 10 గంటల వరకు పొగమంచు
- మినుములూరులో 9..
- అరకులోయలో 10..
- చింతపల్లిలో 10డిగ్రీల నమోదు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. చలిగాలులు తీవ్రత నెలకొంది. శుక్రవారం ఉదయం 10 గంటల వరకు పొగమంచు దట్టంగా కురిసింది. పాడేరు, అరకు వారపుసంతలకు గిరిజనులు పొగమంచు, చలిలో ఉదయాన్నే చేరుకున్నారు. పాడేరు మండలంలోని మినుములూరు కాఫీ బోర్డు వద్ద 9 డిగ్రీలు, అరకులోయ, చింతపల్లి ప్రాంతాల్లో 10 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం నుంచి ప్రజలు చలిమంటలను ఆశ్రయించారు.

కిక్కిరిసిన పాడేరు



పాడేరులో రద్దీగా మారిన మెయిన్‌రోడ్డు

- రద్దీగా వారపుసంత
- భారీగా తరలివచ్చిన గిరిజనులు
- అటవీ ఉత్పత్తులు విక్రయించి, పండగ దినుసులు కొనుగోలు
- కిటకిటలాడిన వస్త్ర, మట్టిపాత్రల దుకాణాలు

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరు జనంతో కిక్కిరిసిపోయింది. సంక్రాంతి పండగ నేపథ్యంలో పాడేరులో శనివారం జరిగిన వారపు సంతకు హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల గిరిజనులు భారీగా తరలివచ్చారు. వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించారు. సంక్రాంతి పండగకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేశారు. రాజ్‌మా, కాఫీ గింజలు, పసుపు, పిప్పలమోడి అమ్మకాలు భారీగా జరిగాయి. కొత్త దుస్తులను సంతలో కొనుగోలు చేశారు. సంతలో భారీగా వ్యాపార లావాదేవీలు జరిగాయి. సంత, మెయిన్‌రోడ్డు, సినిమాహాల్ సెంటర్లలో ఉన్న సుమారు 125 వస్త్ర దుకాణాలు రద్దీగా మారాయి. సుమారు రూ.50 లక్షల మేర వస్త్ర వ్యాపారం జరిగినట్టు అంచనా.



పాడేరు సంతలో బట్టల దుకాణాల వద్ద గిరిజనుల కొనుగోళ్లు దృశ్యం

భారీగా కొత్త కుండలు, గాజుల వ్యాపారం

సంక్రాంతి పండగలో గిరిజనులు వినియోగించే కొత్త కుండల వ్యాపారం భారీగా జరిగింది. నక్కలపుట్టుతో పాటు స్థానిక కొండకుమ్మర్లంతా తయారు చేసిన మట్టి పాత్రలను సంతలో విక్రయించారు. సంక్రాంతి పండగ రోజున కొత్త కుండల్లో వంటలు చేసుకోవడం ఆనవాయితీ. గాజుల దుకాణాలు రద్దీగా మారాయి. కిరాణా వ్యాపారం భారీగా జరిగింది. వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా పాడేరు ఎస్‌ఐ లక్ష్మణరావు, సిబ్బంది చర్యలు చేపట్టారు.

రంపచోడవరం: ఏజెన్సీ ప్రధాన కేంద్రం రంపచోడవరం సంక్రాంతి షాపింగ్‌కు వచ్చిన వారితో సందడిగా మారింది. సాధారణంగా గిరిజనులు తమ నిత్యావసరాలు కోసం వారప సంతలపై ఆధారపడతారు.వారానికి కావాల్సిన సరుకులను సంతల్లో కొనుగోలు చేసుకుని వెళ్తారు. సంక్రాంతి దుస్తులు కొనేందుకు వచ్చిన గిరిజనులతో వస్త్రదుకాణాలు కిక్కిరిసిపోయాయి. ఏజెన్సీలోని దేవీపట్నం, గంగవరం, మారేడుమిల్లి మండలాల నుంచి భారీగా తరలివచ్చి కొనుగోలు చేసుకుని వెళ్లారు.

వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం



వాలీబాల్ టోర్నీ విజేతలతో రంపచోడవరం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

వై.రామవరం: కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సంక్రాంతి పురస్కరించ స్థానిక పోలీసు స్టేషన్ వద్ద వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. గురువారం అర్ధరాత్రి వరకు టోర్నమెంట్ కొనసాగింది. సీఐ రాంబాబు పర్యవేక్షణలో ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌కు సంబంధించి రంపచోడవరం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ముఖ్య అతిథి విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. విన్నర్, రన్నర్ జట్లకు షీల్డులు, పాల్గొన్న జట్లకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. సిఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంట్ ఎంఎల్ నాయుడు, అడిషనల్ ఎస్ఐ కె.రాంబాబు పాల్గొన్నారు.

పోటెత్తిన పర్యాటకులు

దేవీపట్నం: గోదావరి నదిపై బోటు ప్రయాణం చేస్తూ పాపికొండల అందాలను వీక్షించేందుకు శుక్రవారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివెళ్లారు. గండిపోశమ్మ ఆలయం వద్ద నుంచి పది బోట్లలో నిబంధనలు పాటిస్తూ 447 మంది పర్యాటకులు పేరపంటపల్లికి తరలివెళ్లి సాయంత్రం నిర్దేశించిన సమయంలో తిరిగి చేరుకున్నారు. సంక్రాంతి సెలవులు కావడంతో నాలుగు రోజుల పాటు పాపికొండలకు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

స్పందన వినతులు పరిష్కరిస్తాం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- 31 వినతుల స్వీకరణ



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్,ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: స్పందనలో స్వీకరించిన వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాస్తవ 31 మంది గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు.

అర్జీల్లో కొన్ని..

-హుకుంపేట మండలం సంతారి పంచాయతీ కుక్కిన గ్రామానికి చెందిన కుడేలి సింహాచలం తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని తమ నలుగురు అన్నదమ్ములకు సమానంగా కేటాయించి పట్టాలు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశాడు.

- హుకుంపేట మండలం కొట్నాపల్లి పంచాయతీలోని బిసాయిపుట్టు నుంచి బొర్ర బాకూరు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని జి.కొండబాబు, ఇదే పంచాయతీలోని పందిమెట్ట గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాలని పాంగి కేశవరావులు విన్నవించారు.
- పెదబయలు మండలం సీకరి పంచాయతీ వెలపాలెం గ్రామస్తులు కిముడు రాధ,కిముడు రంబ అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని విన్నవించారు
- ప్రముఖ పర్యాటక ప్రాంతం చాపరాయిలోని టికెట్ కౌంటర్‌లో ఉద్యోగం కల్పించాలని డుంబ్రిగుడ మండల కేంద్రానికి చెందిన శెట్టి గోపాల్ వినతిపత్రం అందజేశాడు.

ఫేషియల్ హాజరు తప్పనిసరి

కలెక్టర్ సుమిత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: అన్ని ప్రభుత్వశాఖల అధికారులు, ఉద్యోగులు తప్పనిసరిగా ఫేషియల్ (ముఖ) హాజరు వేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఐటీడీఏలో శుక్రవారం స్పందన కార్యక్రమం అనంతరం అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ హాజరు నమోదుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి ప్రత్యేక ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన గిరిజనుల వినతులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖలపై 96 రిట్ పిటిషన్లు ఉన్నాయని, ఆయా శాఖాధిపతులు ఈనెల 20వతేదీ లోగా కౌంటర్ ఫైల్ దాఖలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈసమావేశంలో ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాస్తవ, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, పలు ఇంజనీరింగ్‌శాఖల ఈఈలు డీవీఆర్ఎం రాజు, వేణుగోపాల్, కొండయ్యపడాల్, లీలాకృష్ణ, బాలసుందరబాబు, డీఎల్పీవో పి.ఎస్.కుమార్, ఏటీడబ్ల్యూవో రజనీ తదితరులు పాల్గొన్నారు.

జూద స్థావరాలపై దాడులు

- 12 కేసులు నమోదు
- 4 పందెం కోళ్లు, 33 మంది అరెస్ట్

అనకాపల్లి టౌన్: సంక్రాంతి పండగ నేపథ్యంలో కోడిపందాలు, జూద కార్యకలాపాలపై నిఘా పెంచామని ఎస్పీ గౌతమిసాలి శుక్రవారం పేర్కొన్నారు. ఇంతవరకు కోడి పందెం స్థావరాలపై తమ సిబ్బంది దాడులు నిర్వహించి 12 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 4 పందెంకోళ్లు, 33 మందిని అరెస్ట్ చేసి రూ.30 వేలు స్వాధీనపరుచుకున్నట్లు పేర్కొన్నారు. 66 లీటర్ల బెల్లం పులుపుతోపాటు 22 లీటర్ల నాటుసారా ధ్వంసం చేశామని తెలిపారు. అక్రమంగా తరలిపోతున్న 324 మద్యం బాటిళ్లు, 10 కేజీల గంజాయిని స్వాధీనపరుచుకున్నామన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సాక్షి,పాడేరు: పాడేరులోని మోదకొండమ్మ తల్లిని, ఉమ్మడి విశాఖ జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ సూర్యకుమార్ కుటుంబసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ప్రతినిధులు కొట్టగుళ్లి ఈశ్వరప్రసాద్, రామారావు, శ్రీనివాసనాయుడులు ఘనంగా సన్మానించారు. మోదమ్మ చిత్రపటంతో పాటు, ప్రసాదాలను అందజేశారు.

సీలేరు: ఘాట్‌రోడ్డులో మారెమ్మ తల్లి, దారాలమ్మ అమ్మవారి ఆలయాలను శుక్రవారం ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, విజయ దంపతులు దర్శించుకున్నారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ విజయ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో గిరి గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.



మోదకొండమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఎస్ఈ సూర్యకుమార్ కుటుంబసభ్యులు



దారాలమ్మ అమ్మవారి ఆలయంలో శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ విజయ దంపతులు

మహాదేవ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

అడ్డతీగల : చిత్తూరు జిల్లా రేణిగుంట-శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్‌లోని గువరాజుపల్లెలోని మహాదేవ ఆశ్రమాన్ని అడ్డతీగల పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు రాజేష్‌గిరి తదితరులు వారిని సత్కరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

తాటాకిల్లు దగ్ధం

రాజవొమ్మంగి: మండలంలోని లోదొడ్డి గ్రామంలో గురువారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. గృహంలో నిరుపేద గిరిజనులు బాలరాజు, అతని కుమార్తె గంగ నివసిస్తున్నారు. వృద్ధుడైన బాలరాజు చలికి తాళలేక నెగడి ఏర్పాటు చేసుకొన్నాడు. కాగా చూపు సరిగ్గా కనుపించని బాలరాజు నిప్పు రవ్వలు పైకి ఎగిసిపడడం గమనించలేక పోయాడు. దీంతో ఎగిసిపడిన నిప్పురవ్వలతో ఇంటి పైకప్పు అంటుకొని ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. త్రుటిలో ఇంట్లో ఉన్న వారిద్దరు ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారని స్థానికులు చెప్పారు. ప్రమాదంలో బాధితులు సర్వం కోల్పోయారని, సుమారు రూ.1.5లక్షల ఆస్తినష్టం జరిగి ఉంటుందని సర్పంచ్ లోతా రామారావు చెప్పారు. వలంటీర్ పొత్తూరు లోవరాజుతో కలసి అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి బియ్యం, కొంత నగదు అందజేశారు.



బాధిత కుటుంబానికి సాయమందిస్తున్న సర్పంచ్ రామారావు

వడ్డాది వెంకన్న ఆదాయం రూ.74 వేలు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ. 74,492 వచ్చినట్లు దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు నెల రోజుల్లో ప్రారంభం కానున్నాయి. దీంతో శుక్రవారం అధికారులు తొమ్మిది నెలలకు సంబంధించి హుండీల్లో కానుకల లెక్కించగా, ఈ మొత్తం వచ్చిందన్నారు. గ్రామ పెద్దలు, అర్చకులు పాల్గొన్నారు.

చోరీ కేసులో పాత నేరస్తుడు అరెస్టు

దొంగిలించిన సొత్తు స్వాధీనం

కోటవురట్ల: వరుస చోరీలకు పాల్పడుతున్న ఓ పాత నేరస్తుడిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ నారాయణరావు వివరాల ప్రకారం.. మండలంలోని పాములవాకలో గతేడాది డిసెంబరు 18న కిల్లాడ శ్రీరామ్మూర్తినాయుడు ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు మూడున్నర తులాల బంగారం, 2 తులాల వెండి వస్తువులను ఎత్తుకుపోయారు. అదే నెల 3న నర్సీపట్నం మండలం బలిఘట్టంలో ఓ ఇంట్లో రెండు తులాల బంగారం, వి.మాడుగులలో 5న ఓ ఇంట్లో 75 తులాల వెండి చోరీ చేశారు. పాములవాక ఘటనకు సంబంధించి బాధితులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మండలంలోని రామచంద్రపాలెం గ్రామానికి చెందిన పాత నేరస్తుడు కరక రాజుబాబుపై నిఘా పెట్టారు. పూర్తి సమాచారం మేరకు చోరీ చేసిన వెండి, బంగారు ఆభరణాలను తునిలో విక్రయించేందుకు పాములవాకలో ఆటో ఎక్కుతుండగా ఎస్ఐ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. అతడిని అరెస్టు చేసి తనదైన శైలిలో విచారణ చేయగా పాములవాక, బలిఘట్టం, వి.మాడుగులలో చోరీలకు పాల్పడినట్టు అంగీకరించాడు. నిందితుడి నుంచి మూడు తులాల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. కేసును ఛేదించడంలో చురుగ్గా వ్యవహరించిన సిబ్బందిని ఆయన అభినందించారు.

సకాలంలో ఈ-క్రాప్ నమోదు

చింతపల్లి రూరల్: రబీ ఈ–క్రాప్ నమోదు సకాలంలో పూర్తి చేయాలని ఏడీఏ జాహ్నవి అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రబీ ఈ–క్రాప్ నమోదుతో పాటు ఈకేవైసీని సకాలంలో పూర్తి చేయాలన్నారు. వైఎస్సార్ యంత్ర సేవలో భాగంగా రైతులకు కావలసిన సాగు యంత్రాలను గుర్తించాలన్నారు. విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏవో కన్నబాబు మాట్లాడుతూ మండలంలో పీఎం కిసాన్‌కు సంబంధించి 1,662 మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ–కేవైసీ చేయించని వారు 13వ విడత పీఎం కిసాన్‌కు దూరం అవుతారన్నారు.వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉపమాకలో గోదా కల్యాణం

నక్కపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఉపమాకలో స్వామివారి పుష్పతోటలో శనివారం గోదా రంగనాథుల కల్యాణం నేత్రపర్వంగా జరగనుంది. శ్రీరంగనాథుడ్ని వివాహం చేసుకోవడం కోసం గోదాదేవి నెలరోజులపాటు చేపట్టిన ధనుర్మాస వ్రతం భోగీతో పూర్తి కావడంతో గోదా కల్యాణం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని ఉపమాక ఆలయంలో నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి తిరువీధి సేవ నిర్వహించారు. ఉదయం గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో స్వయం వ్యక్తమై ఉన్న మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులు, గోదాదేవి, వేణుగోపాల స్వామి సన్నిధిలో నిత్యార్చనలు, నీరాజన మంత్రపుష్పాలు, విశేష హోమాలు నిర్వహించారు. బాలభోగనివేదన, రాజభోగ నివేదన కార్యక్రమాలు పూర్తిచేసి, తదుపరి ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని పెద్దపల్లకిలోను, గోదాదేవిని చిన్న పల్లకిలో ఉంచి తిరువీధి సేవలు నిర్వహించారు. అనంతరం తీర్థగోష్టి, ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకులు వరప్రసాద్, అర్చక స్వాములు కష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు, టీటీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైమరిపించే మత్స్యలోకం



అండర్ వాటర్ టన్నెల్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్



టన్నెల్‌లో చేపలను తిలకిస్తున్న చిన్నారులు

ఎగ్జిబిషన్ ప్రారంభించిన మంత్రి అమర్‌నాథ్

ఏయూక్యాంపస్: పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా అండర్ వాటర్ టన్నెల్ ఎగ్జిబిషన్ నిలుస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బీచ్‌రోడ్డును ఆనుకుని ఉన్న ఏయూ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న హ్యాండ్‌లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నో వ్యయప్రయాసల కోర్చి అండర్ వాటర్ టన్నెల్ ఏర్పాటు చేయడంపై నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. మన రాష్ట్రంతో పాటు బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులకు ఇది మంచి అనుభూతినిస్తుందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి అక్వేరియంలో విభిన్న వర్ణాల చేపలను ఆసక్తిగా తిలకించారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ రూ.40కే అక్వేరియంలో వివిధ రకాల చేపలు, స్టార్‌ఫిష్‌లు చిన్నారులకు అనిర్వచనీయమైన అనుభూతిని పంచుతాయన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

మాకవరపాలెం: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్ఐ రామకృష్ణారావు శుక్రవారం తెలిపారు. మండలంలోని కొండల అగ్రహారం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో దాడి చేశామన్నారు. ఈ దాడిలో రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి, కేసు నమోదు చేశామన్నారు.

గిరి రైతులకు గిట్టుబాటు ధర లక్ష్యం

జీసీసీ ఎండీ సురేష్‌కుమార్



స్టాక్‌ను పరిశీలిస్తున్న జీసీసీ ఎండీ సురేష్‌కుమార్

గూడెంకొత్తవీధి: గిరిజన సహకార సంస్థ గిరిజన రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకే ఏర్పడిందని ఆసంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన గూడెంకొత్తవీధి మండలంలో పర్యటించారు. పెదవలసలో సంతలో కాఫీ క్రయ విక్రయాలను పరిశీలించారు.ఈ ఏడాది కాఫీతో సహా, రాజ్‌మా, చిరుధాన్యాలు, ఉసిరి, తేనె వంటి అటవీ, వ్యవసాయోత్పత్తులకు జీసీసీ గిట్టుబాటు ధరలను చెల్లిస్తుందన్నారు. రైతులు దళారులు, వ్యాపారులను నమ్మి మోసపోకుండా జీసీసీని బలోపేతం చేయాలని ఎండీ కోరారు. జీసీసీ గూడెంకొత్తవీధి బ్రాంచి మేనేజరు మల్లేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ అప్పలరాజు, సేల్స్‌మెన్ బాలరాజు ఉన్నారు.

భర్త వేధింపులకు భార్య ఆత్మహత్య

- యలమంచిలిలో ఉరేసుకుని సంతోషి బలవన్మరణం
- సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాసరావు
- భర్త జగదీశ్వరరావు రిమాండ్‌కు తరలింపు

యలమంచిలి : జీవితాంతం తోడు నీడగా ఉంటాడనుకున్న భర్త వేధింపులకు గురి చేయడంతో వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన యలమంచిలి పట్టణం రంగావారి వీధిలో చోటు చేసుకుంది. భర్త నుంచి శారీరక, మానసిక హింసతో పాటు వరకట్న వేధింపులు అధికమవడంతో స్థానికంగా అద్దె ఇంట్లో ఉంటున్న బెండు సంతోష(30) గురువారం రాత్రి బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త, అత్తింటి వేధింపులే సంతోషి మరణానికి కారణమంటూ మృతురాలి సోదరుడు బెండు నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పండగ పూట రెండు కుటుంబాల్లో విషాదం నింపిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు అందించిన వివరాలు..

శ్రీకాకుళం జిల్లా కొటబొమ్మాలి మండలం, సరియపల్లి గ్రామానికి చెందిన బెండు సంతోషి, అదే మండలంలోని ఉమ్మిలాడ గ్రామానికి చెందిన ఉంకిలి జగదీశ్వరావు 2017వ సంవత్సరంలో వివాహం చేసుకున్నాడు. వీరికి రెండున్నరేళ్ల వయసున్న పాప విహన, 9 నెలల బాబు జష్విన్ ఉన్నారు. వివాహ సమయంలో కట్నంగా రూ.5 లక్షలు తీసుకున్నాడు. పెళ్లైన ఐదేళ్ల నుంచి విశాఖలోని నక్కపల్లి మండలంలో ఉన్న హెటిరో పరిశ్రమలో పని చేస్తున్నాడు. యలమంచిలి పట్టణంలో రంగావారి వీధిలో గత కొంత కాలంగా అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. సంతోషికి వివాహం జరిగిన నుంచి కట్నం తక్కువ తెచ్చావంటూ.. అత్త ఉంకిలి అనసూయమ్మ, పెద్ద ఆడపడుచు పిలక విజయలక్ష్మి, భర్త జగదీశ్వరరావు వేధించేవారు. జగదీశ్వరరావు తన సోదరి విజయలక్ష్మి కూతుర్ని వివాహం చేసుకునేందుకు తనను తరచూ శారీరకంగా, మానసికంగా హింసించేవారని సంతోషి తన తల్లిదండ్రులకు ఫోన్‌లో చెప్పేది. కట్నం విషయమై గురువారం మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో భార్యాభర్తలు గొడవ పడి, బెల్ట్, చీపురుతో జగదీశ్వరరావు సంతోషిని కొట్టాడని తన మామయ్య వీరయ్యకు చెప్పగా ఆయన వారిద్దరికీ నచ్చజెప్పారు. రాత్రి 7 గంటలకు సంతోషి తన బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు వీరయ్యకు జగదీశ్వరావు ఫోన్‌లో తెలిపాడు.



ఘటనా స్థలంలో విచారణ చేపడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు



సంతోషి (ఫైల్)

పోలీసుల దర్యాప్తు

ఈ ఘటనకు సంబంధించి మృతురాలి సోదరుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం దర్యాప్తు ప్రారంభించారు. పరవాడ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ షేక్ గఫూర్, ఎస్సై పాపినాయుడు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల నుంచి వివారాలు సేకరించారు. ఇందుకు సంబంధించి ఐపీసీ 304బీ, 498ఏ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. తహసీల్దారు రాణీ అమ్మాజీ కుటుంబ సభ్యులతో మాట్లాడి వాంగ్మూలం తీసుకున్నారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసులో ప్రధాన నిందితుడు జగదీశ్వరావును రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాలతో తల్లి బలవన్మరణానికి పాల్పడడం, తండ్రి రిమాండ్‌కు వెళ్లడంతో వారి పిల్లలు అనాథలుగా మిగలటం స్థానికులను కలచివేసింది.